క్లుప్తంగా

మత్తు పదార్థాలతో జీవితం నాశనం



నల్లూరులో మాట్లాడుతున్న ఎస్ఐ హరీష్

కపిలేశ్వరపురం: మత్తు పదార్థాలను దరి చేరనీయొద్దని, వ్యసనాలకు లోనైతే జీవితం నాశనమవుతుందని అంగర ఎస్ఐ జి.హరీష్‌కుమార్ హెచ్చరించారు. కపిలేశ్వరపురం మండలం నల్లూరులో సోమవారం విద్యార్థులు, గ్రామస్తులకు 'మత్తు పదార్థాల వినియోగం – వాటి దుష్ప్రభావాలు – నివారణ చర్యలు' అనే అంశంపై అవహహన సదస్సు నిర్వహించారు. సైబర్ నేరాలు, మహిళా భద్రతపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడడం ద్వారా ఆరోగ్యంతో పాటు సామాజిక గౌరవాన్ని సైతం కోల్పోతారన్నారు. కార్యక్రమంలో శక్తి టీం మహిళా కానిస్టేబుల్ విజయలక్ష్మి, కానిస్టేబుల్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు



అంగర జెడ్పీ ఉన్నత పాఠశాలలో నగదు బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

కపిలేశ్వరపురం: అంగర జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరం వార్షిక పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఓ దాత రూ.10,116 నగదు బహుమతులను అందజేశారు. ఆయన సమకూర్చిన బహుమతులను సోమవారం పాఠశాలలో మాజీ సర్పంచ్ సంకాబత్తుల స్వామికాపు, నీటి సంఘం అధ్యక్షుడు కొమ్మిశెట్టి సూరిబాబు, సామాజిక కార్యకర్తలు వీరబాబు, శరత్‌కుమార్ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన పేపకాయల ప్రసన్న, అరవపల్లి ఈశ్వరి, కర్రి జాహ్నవి నగదు ప్రోత్సాహక బహుమతులను అందుకున్నారు.

సేవా భావంతో మానసిక ప్రశాంతత



ఆర్యావటంలో బ్రాహ్మణులకు సరకులు అందజేస్తున్న సమరసత సేవా సంస్థ సభ్యులు

కాజులూరు: సేవా భావంలోనే మనిషికి మానసిక ప్రశాంతత ఉంటుందని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ పడాల రఘు, పూర్వపు ధర్మ ప్రచారక్ డాక్టర్ శీలామంతుల వీరభద్రరావు అన్నారు. అమెరికాలో నివాసముంటున్న ప్రవాస భారతీయుడు అయ్యల సోమయాజు తన 71వ పుట్టినరోజుని పురస్కరించుకుని గ్రామంలో పలువురు పేద బ్రాహ్మణులకు నిత్యావసర వస్తువులు, దుస్తులు సమకూర్చగా పడాల రఘు, డాక్టర్ శీలామంతుల వీరభద్రరావు సోమవారం వాటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ మండల కన్వీనర్ కంచి గోవిందు, సభ్యులు పడాల తేజశ్రీ, పలువురు బ్రాహ్మణ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పోస్టుమాస్టర్ సుబ్బలక్ష్మి మృతి



కె.గంగవరం: మండలంలో అద్దంపల్లి బ్రాంచి పోస్టుమాస్టర్‌గా పనిచేసిన పి.సుబ్బలక్ష్మి అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆమె పోస్టుమాస్టర్‌గా కొన్నేళ్లుగా అద్దంపల్లి గ్రామం పని చేశారు. ఆమె మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సుబ్బలక్ష్మికి కుమారుడు విష్ణు కోటిపల్లిలోని విజ్ఞాన భారతీ స్కూల్ హెచ్‌మాస్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆమె మృతికి బీజేపీ నాయకులు కర్రి చిట్టిబాబు, ఏవీవీ రమణమూర్తి, నారాయణరావు, బీవీబీఎల్ నారాయణ, సలాది శేఖర్ తదితరులు సంతాపం తెలిపారు.

3,865 మందికి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

కపిలేశ్వరపురం: అంగర పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో 3,865 మందికి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసినట్టు పీహెచ్‌సీ వైద్యాధికారి పీఎస్‌ఎస్‌డీ రత్నకుమారి సోమవారం తెలిపారు. పీహెచ్‌సీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని ఐదేళ్లలోపు 332 బాలురు, 377 బాలికలు మొత్తం 709 మంది చిన్నారులకు మాత్రలను అందజేయనున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని 5–15 ఏళ్ల బాలురు 1,445, బాలికలు 1,299 మొత్తం 2,744 మందికి మాత్రలను పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. పలు ఉన్నత విద్యా సంస్థల్లోని 15–19 ఏళ్ల బాలురు 61, బాలికలు 351 మొత్తం 412 మందితో మాత్రలను మింగించనున్నట్టు వైద్యాధికారి రత్నకుమారి తెలిపారు.

అభివృద్ధికి దారేదీ?

- విస్తరణకు నోచుకోని ప్రధాన రహదారి
- కపిలేశ్వరపురం–అంగర మార్గంలో నిత్యం వాహనాల రద్దీ
- ఇరుకు దారిలో వాహనచోదకుల ఇక్కట్లు
- మూడు నియోజకవర్గాల ప్రజలకు తప్పని అవస్థలు



విస్తరణకు నోచుకోని కపిలేశ్వరపురం–అంగర రహదారి

కపిలేశ్వరపురం: కూటమి ప్రభుత్వం రాగానే రహదారులకు మహర్దశ పట్టిస్తామని చంద్రబాబునాయుడు, జనసేన నేత పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చిన తరువాత పక్కకుపోయాయి. రహదారులను నిర్మిస్తామన్న నేతలు కేవలం మరమ్మతులతో సరిపెట్టారు. అందుకు ఆర్థిక కారణాలెన్నో చెబుతున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల సంగతి ఏమిటని ప్రశ్నించిన వారిని కేసులతో భయపెడుతున్నారు. ఎన్నికల సమయంలో ఆర్థిక కారణాలు అంచనా వేసుకుని హామీలు ఇవ్వాలి కదా అన్న ప్రశ్నకు సమాధానం లేదు. మండల కేంద్రమైన కపిలేశ్వరపురం–అంగర ఆర్‌అండ్‌బీ రహదారి దుస్థితి ఇందుకు ఒక ఉదాహరణ.

రహదారి నిర్మాణ పనుల నేపథ్యం

కపిలేశ్వరపురం– మండపేట రహదారి విస్తరణ పనులు 2016లో చేపట్టారు. 16.2 కిలోమీటర్ల మేర 3.5 మీటర్లు వెడల్పుతో ఉన్న రహదారిని ఏడు మీటర్లకు వెడల్పు చేసేందుకు ఆరోజుల్లో రూ.16.03 కోట్లు నిధులు మంజూరయ్యాయి. 11 కిలోమీటర్లు మేర తారు, 3.2 కిలోమీటర్లు మేర సీసీ రోడ్డుగా మెరుగుపర్చారు. నిధుల సర్దుబాటు కారణంగా 14.2 కిలోమీటర్లు మేరకు మాత్రమే పనులు చేపట్టారు. దీంతో 1.7 కిలోమీటర్లు మేర కపిలేశ్వరపురం–అంగర రహదారి విస్తరణ పనులు నిలిచిపోయాయి. తొమ్మిదేళ్లుగా కపిలేశ్వరపురం–అంగర ఆర్‌అండ్‌బీ రహదారి విస్తరణ పనులు ఒక్క ఇంచు కూడా కదలని పరిస్థితి నెలకొంది.

ప్రయాణికులకు ఇబ్బందులు

19 గ్రామాలకు మండల కేంద్రంగా కపిలేశ్వరపురం ఉంది. ప్రభుత్వ కార్యాలయాలన్నీ కపిలేశ్వరపురంలో ఉండటంతో ప్రభుత్వ ఉద్యోగులు, కార్యాలయాలకు వెళ్లే సందర్శకులతో నిత్యం రహదారి రద్దీగా ఉంటుంది. కపిలేశ్వరపురం ఐసీడీఎస్ ప్రాజెక్టును మండపేటకు తరలించినప్పటికీ అక్కడలో కార్యాలయ భవనం లేకపోవడంతో కార్యకలాపాలన్నీ కపిలేశ్వరపురంలోని ఐసీడీఎస్ కార్యాలయ భవనంలోనే నిర్వహిస్తున్నారు. అక్కడికి వందలమంది అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు వచ్చి వెళ్తుంటారు. కపిలేశ్వరపురంలోని సీహెచ్‌సీ ఆసుపత్రికి నేలటూరు, వల్లూరు, వెదురుమూడి, టేకి, నల్లూరు, అంగర, పడమర ఖండ్రిక గ్రామాల ప్రజలు అంగర–కపిలేశ్వరపురం రహదారి మీదుగా వెళ్తుంటారు. తాతపూడి, కపిలేశ్వరపురం ర్యాంపుల నుంచి ఇసుక లారీలు ఈరహదారి మీదుగానే రాకపోకలు సాగిసుంటాయి. కపిలేశ్వరపురం, వెదురుమూడి, అంగర, పడమర ఖండ్రిక గ్రామాల్లోని బట్టీల నుంచి ఇటుక వాహనాల రాకపోకలతో రహదారి రద్దీగా ఉంటోంది. వ్యవసాయ ఉత్పత్తులు తరలించే వాహనాలతో పాటు అంగర, ఆలమూరు, మండపేట, రామచంద్రపురం పట్టణాల్లోని విద్యాలయాలకు చెందిన వాహనాలు ఈ రహదారి మీదుగా వెళ్తుంటాయి. ఇంతటి ప్రాధాన్యత గల కపిలేశ్వరపురం–అంగర ఆర్‌అండ్‌బీ రహదారిని త్వరితగతిన విస్తరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రయాణికుల అవస్థలు



"మండపేట నుంచి అంగర వరకూ విస్తరణ పనులు పూర్తి చేసినప్పుడు కపిలేశ్వరపురం గ్రామాన్ని విస్మరించారు. అంగర నుంచి కపిలేశ్వరపురం రహదారికి విస్తరణ పనులు చేపట్టకపోవడంతో వాహనాల తాకిడికి సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి రహదారిని కపిలేశ్వరపురం వరకూ విస్తరణ పనులు చేపట్టాలి."

– కుడుపూడి విజయ్‌కుమార్, కపిలేశ్వరపురం

వ్యవసాయం కార్పొరేటీకరణతో ప్రమాదం

కపిలేశ్వరపురం: భారతదేశానికి వ్యవసాయం ప్రధాన ఆర్థిక వనరు అనీ ఆ రంగంలో కార్పొరేటీకరణ అత్యంత ప్రమాదకరమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కామన ప్రభాకరరావు సోమవారం ఓ ప్రకటనలో అన్నారు. వ్యవసాయం రంగంలోకి కార్పొరేట్ కంపెనీలకు అనుమతి ఇచ్చే ఆలోచనను ఎన్‌డీఏ ప్రభుత్వం విరమించుకోవాలన్న డిమాండ్‌పై ఈ నెల 13న జిల్లా కేంద్రంలో నిరసన ప్రదర్శన చేయనున్నామన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో క్విట్ కార్పొరేట్ నినాదంతో నిర్వహించనున్న ఆందోళన కార్యక్రమంలో రైతులు విరివిగా హాజరుకావాలని కామన కోరారు.

ప్రకటన బోర్డులకు దరఖాస్తుల ఆహ్వానం

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మున్సిపల్ పరిధిలో ప్రకటన, ప్రచారం నిమిత్తం డిస్‌ప్లేడివైజ్ (కాంటి లివర్స్) ఏర్పాటు చేసుకునేందుకు ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కమిషనర్ టీవీ రంగారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీ మున్సిపల్ యాక్ట్ 1965 సెక్షన్స్ 114, 115 నిబంధనలు మేరకు మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని కమిషనర్ తెలిపారు.

సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలు ప్రారంభం



సోమేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు



మాచర పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ–2 విజయ్‌కుమార్

రాయవరం: మండలంలో సెల్ఫ్ అసెస్‌మెంట్–1 పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. గతేడాది నిర్వహించిన పరీక్షల్లో విద్యార్థులు జవాబులను పేపర్లపై రాయగా, ఈ ఏడాది నూతన విధానంలో జవాబులు రాశారు. ప్రశ్న పత్రాలకు జవాబులను ఎస్‌సీఈఆర్‌టీ ద్వారా సరఫరా చేసిన బుక్‌లెట్స్‌లో జవాబులు రాయించారు. బుధవారంతో పరీక్షలు ముగియనున్నాయి. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఎంఈవోలు, సీఆర్‌పీలు సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలను పర్యవేక్షించారు.

కపిలేశ్వరపురం: మండలంలో విద్యా శాఖ ఆధ్వర్యంలో సోమవారం తెలుగు, గణితం నిర్మాణాత్మక మూల్యాంకన పరీక్షలు మొదటి రోజు ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. అందుకు తగిన పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. మొట్టమొదటి సారిగా సమగ్ర శిక్ష ప్రవేశ పెట్టిన బుక్‌లెట్ల విధానంలో ఈ పరీక్షలు నిర్వహించారు. పరీక్షల నిర్వహణను మండల ఎంఈఓ–2 ఖండవల్లి విజయకుమార్ పర్యవేక్షించారు. ఆయన మాచర జెడ్పీ ఉన్నత పాఠశాలలో పరీక్షల నిర్వహణను పరిశీలించారు. మండలంలోని ప్రాథమిక పాఠశాలల్లో 903 మంది, ఉన్నత పాఠశాలల్లో 1,634 మంది విద్యార్థిని, విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. మంగళవారం హిందీ, సైన్సు, బుధవారం ఇంగ్లిష్, సోషల్ పరీక్షలు నిర్వహించనున్నట్టు ఎంఈఓ 2 విజయ్‌కుమార్ తెలిపారు.

రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో విలీనం చేయాలి

పీడీఎస్‌యూ, పీవైఎల్ ప్రజా సంఘాల డిమాండ్



రిలే దీక్షల్లో పాల్గొన్న వివిధ పార్టీల నేతలు, సంఘాల నాయకులు

రామచంద్రపురం: నియోజకవర్గ ప్రజలకు రవాణా, పరిపాలనా సౌకర్యాలు సులభంగా అందుబాటులో ఉండేలా, రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో విలీనం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ, పీవైఎల్ నాయకులు వి.భీమా శంకరం ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు సోమవారం మీడియాతో వారు మాట్లాడుతూ రామచంద్రపురం నియోజకవర్గం అమలాపురం నుంచి సుమారు 75 కిలోమీటర్ల దూరంలో ఉంది. గోదావరి నది వరదలు, తుపానులు వంటి ప్రకృతి విపత్తుల సమయంలో రవాణా సౌకర్యాలు దెబ్బతినడం వల్ల జిల్లా కేంద్రానికి చేరుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. కాకినాడ జిల్లా ప్రధాన కేంద్రం రామచంద్రపురం నుంచి కేవలం 25 కిలోమీటర్ల దూరంలో ఉండడం వల్ల పరిపాలనా సేవలు వేగంగా, సమయానికి అందే అవకాశం ఉంటుందన్నారు. గతంలో (2004–2009) పునర్విభజనలో రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో చేర్చే ప్రతిపాదన ఉన్నప్పటికీ అమలు కాలేదన్నారు. కాకినాడ జిల్లాలో విలీనం చేసి, ప్రజల దీర్ఘకాలిక సమస్యను పరిష్కరించాలని స్పష్టం చేశారు. లేని పక్షంలో విలీనం చేసే వరకు పోరాడుతామన్నారు.

మున్సిపల్ తీర్మానానికి వినతి పత్రం

రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో కలపాలని కోరుతూ రామచంద్రపురం మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు తీర్మానం చేయాలని చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవికి పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, న్యాయవాదులు, వివిధ పార్టీల నేతలు వినతి పత్రాన్ని అందజేశారు. అలాగే పార్టీలకు అతీతంగా మున్సిపల్ కార్యాలయం ఎదురుగా రిలే దీక్షలు చేపట్టారు. వివిధ పార్టీలకు, సంఘాలకు చెందిన నాయకులు, ఉద్యోగ సంఘాల నేతలు, ప్రముఖులు ఈ దీక్షలకు మద్దతు పలికారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందజేస్తున్న శ్రీరామచంద్రమూర్తి, విష్ణుమూర్తి తదితరులు

కాజులూరు: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు విద్యాతో పాటు క్రీడలూ ఎంతగానో దోహదం పడతాయని కాజులూరు జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం మార్ని విష్ణుమూర్తి అన్నారు. రోటరీక్లబ్ అధ్యక్షుడు తడాల సత్యనారాయణ, క్లబ్ సభ్యుడు మల్లిపూడి బుజ్జి, యర్రపోతవరం పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్ సంయుక్తంగా పాఠశాలకు పలు క్రీడా సామగ్రిని బహూకరించగా సోమవారం స్థానిక నాయకుడు అన్యం శ్రీరామచంద్రమూర్తి, హైస్కూల్ హెచ్‌ఎం మార్ని విష్ణుమూర్తి విద్యార్థులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు క్రీడలలోనూ రాణించాలన్నారు. స్పోర్ట్స్ కోటాలో ఉన్నత ఉద్యోగాలు, పదవులు సాధించిన పలువురి జీవిత చరిత్రలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో స్కూల్ విద్యాకమిటీ చైర్మన్ పెంటపాటి పద్దరాజు, ఉపాధ్యాయులు చింతా నారాయణమూర్తి, కె.హరినాథ్, షేక్ వలీబాషా, రామకృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భీమేశ్వరస్వామిని దర్శించుకున్న కృష్ణంరాజు సతీమణి



ద్రాక్షారామ భీమేశ్వరస్వామి సన్నిధిలో శ్యామలాదేవి, బంధువులు

రామచంద్రపురం రూరల్: ప్రముఖ సినీ నటుడు, రెబల్ స్టార్ దివంగత ఉప్పలపాటి కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి బంధువులతో కలసి సోమవారం ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారిని, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం బేడా మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు.

ర్యాలి ఆలయానికి విరాళాలు



దాతలకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ సిబ్బంది

కొత్తపేట: ఆత్రేయపురం మండలం ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయం అభివృద్ధికి, అన్నప్రసాద పథకానికి భక్తులు విరివిగా విరాళాలు అందజేస్తున్నారు. దానిలో భాగంగా సోమవారం అమెరికాలో స్థిరపడిన మేధా రాకేష్‌రెడ్డి, దీప్తి దంపతులు ఆలయ అభివృద్ధి కార్యక్రమాల నిమిత్తం రూ.21 వేలు, కొవ్వూరుకు చెందిన చామర్తి నాగకుమార్, అనురాధ దంపతులు అన్నప్రసాద పథకానికి రూ.10,116 విరాళంగా సమర్పించారు. దాతలకు దేవస్థానం తరఫున అధికారులు, వేదపండితులతో ఆశీర్వచనం చేయించి, స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించి, స్వామివారి చిత్రపటాలను అందజేశారు.

వ్యక్తి మృతిపై కేసు

పి.గన్నవరం: ఎల్.గన్నవరం శివారు నడిగాడిలో అనారోగ్యంతో బాధపడుతున్న ఒక వ్యక్తి ఆదివారం రాత్రి మృతి చెందిన నేపథ్యంలో గుర్తు తెలియని వ్యక్తి డయల్ 100కి చేసిన ఫోన్ కాల్‌తో పి.గన్నవరం పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. నడిగాడికి చెందిన సరెళ్ల మల్లేశ్వరరావు (43) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో నాలుగు నెలల క్రితం హార్ట్‌కు స్టంట్ కూడా వేయించుకున్నట్టు ఏఎస్సై పట్టాభిరామయ్య తెలిపారు. ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో అతడు ఇంటివద్ద ఛాతీ నొప్పితో బాధపడుతుండగా 108 అంబులెన్స్‌కి ఫోన్ చేశారన్నారు. అంబులెన్స్ వద్దకు అతడిని కుర్చీలో తీసుకు వచ్చేసరికి మృతి చెందాడన్నారు. నాగమల్లేశ్వరరావు అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడని కుటుంబ సభ్యులు చెప్పారన్నారు. ఈనేపథ్యంలో గుర్తు తెలియని వ్యక్తి డయల్ 100కి ఫోన్ చేయడంతో ఆ కాల్ ఆధారంగా సీఐ భీమరాజు ఆదేశాలతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై తెలిపారు. మృతదేహానికి రాజోలు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు.

జాతీయత, దేశ సమగ్రత మనందరి లక్ష్యం



ర్యాలీలో పాల్గొన్న ఆర్డీవో అఖిల తదితరులు



కపిలేశ్వరపురంలో ర్యాలీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



మండపేటలో జాతీయ జెండాతో ర్యాలీ

రామచంద్రపురం: జాతీయతను, దేశ సమగ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని రామంచద్రపురం ఆర్డీవో డి.అఖిల అన్నారు. మున్సిపల్ కార్యాలయం ఆధ్వర్యంలో సోమవారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. భారీ త్రివర్ణ పతాకాన్ని పట్టణ పురవీధులలో రెపరెపలాడించారు. ఈ ర్యాలీలో రామచంద్రపురం ఆర్డీవో అఖిల, మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, మున్సిపల్ కమిషనర్ కేఆర్‌ఆర్‌కే రాజు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు అత్యంత వైభవంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ర్యాలీ మున్సిపల్ కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు మీదుగా రాజగోపాల్ సెంటర్ వరకు సాగింది. జాతీయ జెండాలు పట్టుకొని నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఆర్డీవో అఖిల తదితరులు మాట్లాడుతూ ఎంతోమంది మహానుభావుల కృషితో స్వాతంత్రం సిద్ధించిందని అన్నారు. ఈనెల 13, 14, 15 తేదీల్లో ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశ ప్రతిష్టను ఇనుమడింపజేయాలని, యువత దేశభక్తిని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. వైఎస్‌ఆర్ సీపీ నేతలు పెంటపాటి శ్రీను, పోతంశెట్టి గోపాలకృష్ణ, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, నాయకులు చందమామ వాసు, కంచుమర్తి బాబూరావు, దంగేటి గౌరీ శంకర్, బీజేపీ నేత కొట్టువాడ హరిబాబు, ఈ శ్రీకాంత్, పలువురు ఉద్యోగులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా తిరంగ యాత్ర

కపిలేశ్వరపురం: మండపేట నియోజకవర్గంలోని మండపేట పట్టణం, రూరల్, కపిలేశ్వరపురం మండలాల్లో సోమవారం తిరంగ యాత్ర ఘనంగా నిర్వహించారు. మండపేట పట్టణంలో రథం గుడి నుంచి కేపీ రోడ్డు మీదుగా కలువ పువ్వు సెంటర్‌లోని మున్సిపల్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు, పలు ప్రభుత్వ శాఖల సిబ్బంది, పలు రాజకీయ పార్టీల నాయకులు 500 అడుగుల పొడవు గల జాతీయ జెండాను చేతపట్టి ర్యాలీలో పాల్గొన్నారు. భారీ జెండా పట్టణవాసులను, ప్రయాణికులను విశేషంగా ఆకర్షించింది. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి భారతీయుడు జాతీయ జెండాను, స్వాతంత్ర్యోద్యమ లక్ష్యాన్ని ఎల్లప్పుడూ గౌరవించాలన్నారు. ఆ దిశగా జీవించడానికి అలవాటు పడాలన్నారు. కౌన్సిలర్ కాళ్లకూరి స్వరాజ్య భవాని, పలు రాజకీయ పార్టీల నాయకులు చుండ్రు శ్రీవరప్రకాష్, కోన సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు, రెవెన్యూ అధికారి జేవీఎస్ శాస్త్రి, డీఈఈ కె.శ్రీనివాస్, ఏఈ లు డి.పవన్‌కుమార్, ఆర్.అనూషలక్ష్మి, మెప్మా సీఎంఎం సుజాత, విద్యార్థులు, మెప్మా ఆర్‌పీలు, మున్సిపల్, సచివాలయం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కపిలేశ్వరపురంలో...

గ్రామ వీధుల్లో జాతీయ జెండా ప్రదర్శ ఘనంగా నిర్వహించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, ఉద్యోగ సంఘాల నాయకులు హర్ ఘర్ తిరంగ నినాదంతో ర్యాలీలో నినదించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీఓ మోహన్, తహసీల్దార్ శ్రీనివాసరావు, సర్పంచ్ సాకా శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ నెక్కంటి శ్రీరాంజీ, ఉద్యోగుల సంఘం నాయకుడు జిత్తుక మల్లికార్జునుడు, మాజీ ఏఎంసీ చైర్మన్ పువ్వల చిట్టిబాబు, కార్యదర్శులు, వీఆర్వోలు, వైద్య, ఆరోగ్య, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పీపీగా సునీల్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



కె.సునీల్‌కుమార్

రామచంద్రపురం: స్థానిక 13వ అదనపు జిల్లా సెషన్ కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కప్పల సునీల్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆ కోర్టులో ఇన్‌చార్జి జడ్జిగా ఉన్న కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి ఆనందని తొలుత మర్యాద పూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం ఆమె సమక్షంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. నూతనంగా జిల్లా కోర్టు హోదా పొందిన రామచంద్రపురం కోర్టు పీపీగా బాధ్యతలు చేపట్టిన సునీల్‌కుమార్‌ను పలువురు న్యాయవాదులు అభినందించారు.

విద్యార్థులకు జాతీయ జెండాల పంపిణీ



విద్యార్థులకు జాతీయ జెండాలు అందజేస్తున్న బీజేపీ నాయకులు

రామచంద్రపురం రూరల్: హర్‌ఘర్ తిరంగా యాత్ర కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాయకులు పాఠశాల విద్యార్థులకు సోమవారం జాతీయ జెండాలను అందజేశారు. ప్రతి ఇంటిపై మువ్వన్నెల జాతీయ జెండాను ఆవిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ రూరల్ మండల అధ్యక్షుడు ఆకేటి శ్రీకృష్ణ, ఓబీసీ సెల్ నాయకుడు ఇంధన సత్యనారాయణ, యువ మోర్చా మండల అధ్యక్షుడు తోలేటి సూర్య గంగాధర్, ద్రాక్షారామ పీఏసీఎస్ డైరెక్టర్ అల్లం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.